WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 294 | మంగళవారం 24-2-2026 | పేజీలు : 4 | వెల : 5-00



## మౌలిక వసతులు లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు

- భక్తులతో మర్యాదగా వ్యవహరించాలి
- ప్రసాదాల నాణ్యత మరింత పెంపొందించాలి
- దుర్గగుడి ఈవో శీనా నాయక్

2లో

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

- దేశీయ మార్కెట్లో లోహాల ధరలు చుక్కలు
- ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగాఎగబాకింది.
- అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని
- కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి.
- అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్



2లో

# రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి

- రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి
- దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం
- డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి



వికారాబాద్,**నవతరం**

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి

మిగతా 2లో

# తెలంగాణ టిజి ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

- 23నుంచి ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం
- మే 12న తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష




హైదరాబాద్,**నవతరం**

తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక టిజి ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల పక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును

- మిగతా 2లో పేజిలో



## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన


2లో

- విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ
- జిఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం
- ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

### పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం

### హైదరాబాద్‌లో పలుచోట్ల మోస్తరు వర్షం



హైదరాబాద్,**నవతరం**

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి.ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న

మిగతా 2లో

### మార్పు కోసం జరుగుతున్న

## పోరు మరో మలుపు

**కర్ణాటకలో కుమ్ములాట.. కేబినెట్ విస్తరణ కోసం 31 మంది ఎమ్మెల్యేలు రాహుల్‌కు లేఖ**



బెంగళూరు**నవతరం** కర్ణాటకలో నాయకత్వ మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు తిరిగింది. మంత్రివర్గ పునర్వవస్థీకరణలో తమకు చోటు కల్పించాలని కోరుతూ తొలిసారి గెలిచిన 31 మందికి పైగా ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి సోమవారంనాడు లేఖ రాశారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అడ్రెస్ చేస్తూ ఎమ్మెల్యేలు ఈ లేఖ రాశారు.'కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి 38 మంది కొత్త వారిని ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి పంపిన విషయం మీకు తెలుసు. తద్వారా అసెంబ్లీలో కొత్త వారిని చూడాలని అనుకుంటున్నట్టు ప్రజలు స్పష్టమైన సందేశాన్నిచ్చారు' అని అధిష్టానానికి రాసిన లేఖలో

మిగతా 2లో




# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

**సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం**

**టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ**

హైదరాబాద్,**నవతరం**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటు లోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్

# రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి

(మొదటి పేజి (తరువాయి)

పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించ డంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న



కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుం టున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం

వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ఈఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

## తనుచదువుకున్న పాఠశాలలోనే సేవా కార్యక్రమాలకు శ్రీకారం

- విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం లక్ష్యం
- సొంత నిధులతో వాటర్ డ్రమ్ము అందజేసిన
- 13వ కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి




గుమ్మడిదల మున్సిపాలిటీ నవతరం:- గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని తాను చదువుకున్న పాఠశాలలోనే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచారు 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. పాఠశాలలో ఉన్న పాత వాటర్ డ్రమ్ము పూర్తిగా పగిలిపోయి నీరు వృథాగా పోతుండగా, ఈ సమస్యపై గత పాలకులు పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నరేందర్ రెడ్డి తన సొంత నిధులతో కొత్త వాటర్ డ్రమ్మును కొనుగోలు చేసి, పైప్ లైన్ ఫిట్టింగ్‌తో సహా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పాఠశాలలో చదువుకున్న తనకు ఈ విద్యాసంస్థపై ప్రత్యేక అనుబంధం ఉందని, చిన్నారుల కోసం ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. చిన్న సమస్యైనా వెంటనే పరిష్కరించడమే మా కాంగ్రెస్ పార్టీ విధానం. నిర్లక్ష్య పాలనతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ఆనంద్ కుమార్, నాగరాజ్, నాయకులు తులసి దాస్, యాదగిరి, పడమటి వెంకటరెడ్డి, మద్దటి మల్లేష్, శ్రీనివాసరెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాహుల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి23
దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.. భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివరాల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు‘ అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..

# అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

హైదరాబాద్,ఫిబ్రవరి23అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్టీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జీ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జీ యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం-పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు.

## వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమో దుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొ మ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాద కరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

## మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు

ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అయితే మంత్రివర్గంలో 34 మందికి చోటు కల్పించినప్పటికీ కొత్తగా ఎన్నికైన ఒక్క ఎమ్మెల్యేకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. ఆ దృష్ట్యా తొలిసారి ఎన్నికైన సమర్థత కలిగిన యువ ఎమ్మెల్యేలకు మంత్రులుగా సేవ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో ఏఎస్ పొన్నన్న, అశోక్ రాయ్, శ్రీనివాస్ ఎన్‌టీ, పి.రవికుమార్, ఏసీ శ్రీనివాస్, హెచ్‌ఏ ఇక్బాల్ హుస్సేన్, బి.దేవేంద్ర, నారా భరత్ రెడ్డి, విశ్వాస్ వి వైద్య, బసవరాజ్ వి శివగంగ తదితరులు ఉన్నారు.

## కల్తీపాల ఘటనలో 12మందికి చికిత్స

**వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది**
**వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్**

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి23
కల్తీ పాల ఘటనలో ఆస్పత్రుల్లో 12 మంది ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ తెలిపారు. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న పాల వ్యాపారి 126 కుటుంబాలకు పాలు పోసినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ కిడ్నీ బాధిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీతో కలిసి వీరపాండ్యన్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు కూడా వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాధితుల వైద్య ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందేఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో పలువురు వివిధ ఆస్పత్రుల్లో చేరారు.

## తెలంగాణ టీజి ఎడ్‌సెట్ నోటిఫజకేషన్ విడుదల

అధికారులు కల్పించారు. రూ. 250 ఫైన్‌తో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నారు. ఇక పరీక్షా నిర్వహణ విషయానికి వస్తే, మే 12వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు. బీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. నగరంలో ఆకాశం మేఘావృతం కాగా.. ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, కాచిగూడ సహా పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. మరోవైపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా అబిడ్స్, బషీర్ బాగ్, సైఫాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అలాగే మీర్ పేట్, బడంగ్ పేట్ ప్రాంతాల్లోనూ వాన పడింది. ఎల్బీ నగర్, మలక్ పేట్, సరూర్ నగర్, చార్మినార్, బీఎన్ రెడ్డి, ఉప్పల్, నాగోల్, అంబర్ పేట్, వనస్థలిపురం, హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీచాయి. వికారాబాద్ ప్రాంతంలో వీస్తున్న భారీ ఈదురు గాలులు ప్రస్తుతం హైదరాబాద్ దిశగా వేగంగా కదులుతున్నాయి. ఈ ప్రభావంతో సాయంత్రం 6 గంటల తర్వాత గచ్చిబౌలి, రాజేంద్ర నగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో బలమైన గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నగరంలో వాతావరణం చల్లబడితే, జిల్లాల్లో మాత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన (రాళ్ల వర్షం) కురిసింది. భారీ గాలుల కారణంగా షాపుల బోర్డులు, ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి.

# కబ్జా కోరల్లో 'నీటి' ఆనవాళ్లు



- నిబంధనలు తుంగలో.. అధికారుల బుకాయింపులు
- అశ్వారావుపేటలో చెరువు కాలువల విధ్వంసం -- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య దోబూచులాట
- నిలువునా మునుగుతున్న సాగునీటి వ్యవస్థ
- దశాబ్దాలుగా ఒక కాలువ ప్రవహిస్తుంటే అది ప్రభుత్వ ఇరిగేషన్ పరిధిలో ఎందుకు లేదు
- అయినా ప్రభుత్వ భూమిలో జెసిబి లు పెట్టి తవ్వుతుంటే పాలనా యంత్రాంగం నిద్రపోతుందా?
- రైతన్న నోటికాడి కూడును కబ్జాదారులు జెసిబిలతో చిదిమేస్తున్నారు
- లక్షల్లోనే ముడుపులు ముట్టాయా?
- ఈ కాలువ నక్షాలో ఉందో,లేదో? ఇరిగేషన్ శాఖ వారికి తెలియదా?




నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి జిల్లా

ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన కంచలే చేను మేస్తున్న చందంగా మారింది అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోని పరిస్థితి. ఊట్లపల్లి సమీపంలో వెంకమ్మ చెరువు సాగునీటి కాలువను జెసిబి లతో ఒక వ్యక్తి ఇస్తారాజ్యంగా పూడ్చివేస్తుంటే అడ్డుకోవలసిన యంత్రాంగం మా పరిధి కాదంటే మా పరిధి కాదు అంటూ తప్పించుకోవడం పరాకాష్టకు చేరుకుంది. రెవెన్యూ మరియు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు విచారణ సాకుతో కాలం గడుపుతుంటే అంతిమంగా లబ్ది పొందుతుంది మాత్రం కబ్జాదారుడే,, ఒక కాలువ దశాబ్దాలుగా ప్రవహిస్తుంటే అది ప్రభుత్వ నక్షాలో ఎందుకు లేదు? ఒకవేళ ఉంటే ఇరిగేషన్ అధికారులు దాన్ని "ఊట కాలువ" అని ఏ ప్రాతిపదికన కొట్టిపారేస్తున్నారు? అయినా ప్రభుత్వ భూమిలో జెసిబిలు పెట్టి తవ్వుతుంటే పాలనా యంత్రాంగం నిద్రపోతుందా? కాలువ గట్టుమీద మట్టి తీయాలన్నా అనుమతి కావాలి. మరి ఏకంగా కాలువనే పూడ్చి కొత్తది తవ్వుతుంటే అధికారులకు కనబడకపోవడం వెనక ఎన్ని లక్షల ముడుపులు ఉన్నాయో అన్న అనుమానాలు సామాన్య రైతంగంలో వ్యక్తం అవుతున్నాయి. అధికారుల ఉదాసీనత వల్ల రేపు సాగునీరు అందక పంటలు ఎండిపోతే బాధ్యత ఎవరిది? ఇరిగేషన్ వారు రెవెన్యూ మీదకు, రెవెన్యూ వారు ఇరిగేషన్ మీదకు నెపం నెట్టడం వల్ల కబ్జాదారుడికి కాలం కలిసి వస్తుంది. అధికారుల విచారణ పూర్తయ్యేసరికి అక్కడ కాలువ స్థానంలో చదునైన పొలం దర్శనమివ్వడం ఖాయంగా కనిపిస్తోంది.పురాతన కాలం నాటి ఆనవాళ్లు మాయమవుతున్నాయి.. రైతన్న నోటికాడి కూడును కబ్జాదారులు చిదిమేస్తున్నారు. సాగునీటి కాలువల ఆక్రమణ పర్వం యథేచ్ఛగా సాగుతోంది. తరతరాలుగా పంట పొలాలకు జీవనాధారంగా ఉన్న వెంకమ్మ చెరువు కాలువను ఓ 'ప్రభావశీలుడైన' రైతు జెసిబిలతో పూడ్చివేస్తుంటే, అడ్డుకోవాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అధికారుల 'ఊట' పురాణం.. బాధ్యత ఎవరిది?

వెంకమ్మ చెరువు నుండి ప్రవహించే మూడు ప్రధాన కాలువల్లో ఒకదానిని సదరు రైతు తన స్వార్థం కోసం రూపురేఖలు మార్చేశాడు. దీనిపై 'నవతరం' ప్రతినిధి ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా, వారు చెప్పిన సమాధానం వింటే సామాన్యుడికి కళ్లు బైర్లు కమ్మక తప్పదు. "అది అసలు కాలువే కాదు.. కేవలం ఊట కాలువ" అంటూ ఇరిగేషన్ శాఖాధికారి చేతులు దులుపుకున్నారు. అంతేకాదు, "నక్షాలో ఏముందో మాకు తెలియదు, అది రెవెన్యూ వాళ్ళను అడగండి" అంటూ బాధ్యతను పక్కన పెట్టేయడం గమనార్హం.

ప్రశ్నార్థకంగా మారిన వ్యవస్థ: తరతరాలుగా నీరు ప్రవహిస్తున్న కాలువను 'ఊట' అని ముద్ర వేసి, కబ్జాదారులకు వంతపాడటం వెనుక అంతర్యమేమిటి? ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపమా? లేక లోపాయికారీ ఒప్పందమా?

### సర్వే నంబర్లు లేవు.. చట్టం వర్తించదా?

ఈ తంతులో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సదరు కబ్జాదారుడు సాగు చేస్తున్న భూమి ప్రభుత్వభూమి, పూడ్చివేసిన కాలువ స్థలానికి కానీ ఎలాంటి అధికారిక సర్వే నంబర్లు లేవని విశ్వసనీయ సమాచారం. అది ప్రభుత్వ స్థలంగా ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ఆ భూమిని సాగు చేస్తూ, ఏకంగా ప్రభుత్వ నీటి వనరులనే ధ్వంసం చేసే స్థాయికి ఆ వ్యక్తి వెళ్లాడంటే, అధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

### వ్యవస్థల వైఫల్యమే పెట్టుబడి!

నక్షాల మాయాజాలం: రెవెన్యూ రికార్డుల్లో (నక్షా) స్పష్టంగా ఉన్న కాలువలను కూడా కాగితాల మీద లేవని నమ్మించే ప్రయత్నం జరుగుతోంది.




పాలనలో పలాయనం: ఒక శాఖపై మరొక శాఖ నెపం నెట్టడం వల్ల అంతిమంగా నష్టపోతోంది నిజాయితీ గల రైతు మాత్రమే.

జేసీబీ రాజ్యాంగం: అనుమతులు లేకుండానే కాలువలను పూడ్చేయడం, కొత్తవి తవ్వుకోవడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. స్థానిక రెవెన్యూ అధికారిని సంప్రదిస్తే, ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ప్రభుత్వ భూమిలో జెసిబి లతో భూమిని తవ్వడంపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సర్వేను పంపి విచారణ చేపడతామని తెలియజేశారు.

జిల్లా కలెక్టర్ స్పందించరా?

ముఖ్యమంత్రి జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో అశ్వారావుపేట అధికారులు మాత్రం కబ్జాదారులకు ఎర్రటి తివాచీ పరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు కాలువ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి. చట్టవిరుద్ధంగా కాలువను పూడ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో సాగునీటి వ్యవస్థలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి. కేవలం రికార్డుల సాకులు చెప్పకుండా క్షేత్రస్థాయిలో ఉన్న కాలువను యధాతథంగా పునరుద్ధరించాలి. కబ్జాదారుడికి వంత పాడుతున్న ఇరిగేషన్ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి, ప్రభుత్వ రికార్డులు లేని కాలువ నుండి నీరు ఎలా ప్రవహిస్తుంది?, అధికారుల దగ్గర ఉన్న లక్ష్యాలను బహిర్గతం చేసే ధైర్యం వారికి ఉందా,,? అంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు.








# కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

గ్రేటర్ హైదరాబాద్, నవతరం: హైదరాబాద్ మహా నగరవాసులను కాలుష్యం ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. కాలుష్య కోరల నుంచి తప్పించుకోవడానికి నగరవాసులు ఎక్కడికి వెళ్లినా వెంటాడుతునే ఉంది. నగరంలో రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యం నుంచి తప్పించుకోవడానికి శివారు ప్రాంతాలలో విల్లాలు, గేటేడ్ కమ్యూనిటీలో నివాసాలు ఏర్పాటు చేసుకుని ప్రశాంతంగా ఉందామనుకుంటున్న వారిని మానవ తప్పిదాలతో జరుగుతున్న వ్యవహారంతో కాలుష్యం బారిన పడుతున్నారు. ఈ భారం నుంచి తమను కాపాడాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను, మరో వైపు పోలీస్ అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని దుండిగల్ మున్సిపాలిటి భౌరంపేట శివారులో ఉన్న త్రిపురా ల్యాండ్ మార్క్-3, ఆర్ఎన్జీ గేటేడ్ కమ్యూనిటీ విల్లాల వాసులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పోలీస్ అధికారులు చొరవ తీసుకుని కాలుష్య భారం నుంచి 250 కుటుంబాలను కాపాడాలని వారు విన్నవించుకుంటున్నారు. భౌరంపేట గ్రామ శివారులో ఓఆర్ఆర్‌కు సమీపంలో



త్రిపుర ల్యాండ్ మార్క్ -3, ఆర్ఎన్జీ గేటేడ్ కమ్యూనిటీలో 250కి పైగా విల్లాలు నిర్మించారు. శివారు ప్రాంతంలో నిర్మించిన ఇక్కడ నివసించడం వల్ల కాలుష్య సమస్యకు దూరంగా, ప్రశాంతంగా జీవించవచ్చని చాలా కుటుంబాలు అక్కడ నివసిస్తున్నారు. కానీ వాటి పక్కనే ఉన్న ఒక ప్రైవేట్ స్థలంలో సంచార జాతుల వారి నివాసాల సమీపంలో ప్రతి రోజు గుట్టలు గుట్టలుగా పాత గుడ్డలు కాల్చి వేస్తుండడంతో వెలువడుతున్న పోగ (కాలుష్యం )తో ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయి. ఈ విషయంపై కాలనీ వాసులు ఇటు కాలుష్య నియంత్రణ మండలికి, అటు పోలీస్ అధికారులకు పిర్యాదులు చేసినా పట్టించుకోవడం




లేదని వాపోతున్నారు. కాలుష్య నియంత్రణకు కట్టుబడాల్సిన అధికారులు నియంత్రించకుండా వారి నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఆర్ఎన్జీ కమ్యూనిటీ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో శ్రీ చైతన్య కాలేజీతో పాటు హస్టల్ నిర్వహిస్తున్నారు. వెయ్యి మంది విద్యార్థులు ఉండే అందులో వ్యర్థాల కోసం సీవరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికి దానిని వినియోగించకుండా వ్యర్థాలను బయటకు వదిలేస్తుండడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యం విషయంలో అధికారులు వెంటనే స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

## ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటానికి దక్కిన విజయం

కవితక్క గర్జనతో దిగివచ్చిన సర్కార్:

- తెలంగాణ జాగృతి పోరాట పటిమకు నిదర్శనం
- ఉద్యమకారుల పక్షాన కవితక్క ఉంటే.. కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారు?
- రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి సూటి ప్రశ్న.



నవతరం, బ్యూరో చీఫ్

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం సాగుతున్న పోరాటం సత్ఫలితాలను ఇచ్చిందని, ఇది తెలంగాణ జాగృతి పోరాట పటిమకు దక్కిన విజయమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేఖరులకు అందజేసిన ఒక ప్రకటనలో ఆయన ప్రస్తుత రాజకీయ పరిణామాలు మరియు ఉద్యమకారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరును వివరించారు.

జై తెలంగాణ.. అని గర్జించిన ఆ ఉద్యమ గొంతుకలు పునరాలోచనలో పడ్డాయి. స్వరాష్ట్ర సాధనతో సంబురపడ్డ ఆ గుండెలకు పుష్కర కాలమైనా ఆశించిన ఆత్మగౌరవం దక్కక అల్లాడుతున్న ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. “ఉద్యమకారుల సమస్యలను గాలికొదిలేస్తే బంగ్లా బయటకు గుంజుతారు” అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు చేసిన శక్తివంతమైన హెచ్చరికతోనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని ఆయన అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగానే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారు స్వయంగా వచ్చి ఉద్యమకారుల సమస్యలను వినడం, వారికి తక్షణమే న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇదే సందర్భంలో బిఆర్ఎస్ పార్టీ వైఖరిని పాండురంగారెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఒకవైపు కవితక్క ఉద్యమకారుల కోసం అలుపెరగని పోరాటం చేస్తుంటే, మరోవైపు కేటీఆర్ గారు ఉద్యమకారుల విషయంలో కనీసం నోరు మెదపకపోవడం విస్మయం కలిగిస్తోందని అన్నారు.


“అధికారంలో ఉన్నప్పుడు ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసి, అసలైన ఉద్యమకారుల ఉనికి లేకుండా చేశామన్న అపరాధ భావనతోనే కేటీఆర్ గారు ముఖం చాటేస్తున్నారా? లేక తన తప్పును ఇంకా తెలుసుకోలేదా?” అని తెలంగాణ సమాజం తరపున ఆయన సూటిగా ప్రశ్నించారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఏ కష్టం వచ్చినా, వారి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లినా కవితక్క ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడి పోరాడుతారని ఈ పరిణామం మరోసారి రుజువు చేసిందని పాండురంగారెడ్డి అన్నారు. ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు.

ధన్యవాదములతో,,

తమ విశ్వసనీయ,
కప్పాటి పాండురంగారెడ్డి
తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు.

## పోలీసు వ్యవస్థ మన భద్రతకు అజ్ఞాత కవచం




నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా

సమాజంలో పోలీసులు గురించి మాట్లాడేటప్పుడు విమర్శలు వినిపించడం సహజం. కొందరి తప్పిదాలు మొత్తం పోలీసు వ్యవస్థపై ముద్ర వేయడం కూడా జరుగుతుంది. అయితే ఒక్కసారి మన గుండెలపై చేయి పెట్టుకుని ఆలోచిద్దాం -- పోలీసు వ్యవస్థ లేకుండా మనం ఒక్కరోజైనా ప్రశాంతంగా జీవించగలమా?మన ఇంటి వద్ద చిన్న గొడవ జరిగినా, రోడ్డు ప్రమాదం జరిగినా, దొంగతనం జరిగినా, మహిళలపై వేధింపులు జరిగినా మొదట గుర్తుకొచ్చేది 100 నెంబర్. మనకు అతి పెద్ద సమస్య వచ్చినప్పుడు కొన్నిసార్లు మన దగ్గరి వారు కూడా వెనక్కి తగ్గొచ్చు. కానీ ఫోన్ కాల్ వెళ్లిన క్షణాల్లోనే అక్కడికి చేరేది పోలీసులే. మనం విమర్శించినా, ప్రశంసించినా అత్యవసర సమయాల్లో మన పక్కన నిలిచేది అదే పోలీసు వ్యవస్థ.

### తెలంగాణలో ఆధునిక పోలీసింగ్

మన రాష్ట్రంలోని తెలంగాణ పోలీస్ దేశంలోనే సాంకేతికంగా ముందంజలో ఉన్న వ్యవస్థగా గుర్తింపు పొందింది. కమ్యూనిటీ పోలీసింగ్, సీసీటీవీ నిఘా, ట్రాఫిక్ నిర్వహణలో డిజిటల్ టెక్నాలజీ వినియోగం, మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు వంటి అనేక కార్యక్రమాలు అమలులో ఉన్నాయి.

ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేసి మహిళలపై జరిగే వేధింపులను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు హాక్ ఐ వంటి యాప్‌ల ద్వారా నేరాలను వెంటనే రిపోర్ట్ చేసే అవకాశం కల్పించారు. ప్రతి జిల్లా, మండల స్థాయిలో 24 గంటల కంట్రోల్ రూమ్స్ పనిచేస్తున్నాయి.

పోలీసులు -- కేవలం నేరస్తులను పట్టుకునే వారు కాదు

పోలీసుల పని కేవలం నేరాలపై చర్యలు తీసుకోవడమే కాదు. వారు:

ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షిస్తారు

శాంతి భద్రతలను కాపాడుతారు

ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపడతారు

పండుగలు, ఎన్నికలు, సభల సమయంలో భద్రత కల్పిస్తారు

ట్రాఫిక్ నియంత్రణ ద్వారా ప్రాణాపాయాలను తగ్గిస్తారువర్షం, ఎండ, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజల కోసం విధులు నిర్వహిస్తుంటారు.

విమర్శ కంటే సహకారం ముఖ్యం

పోలీసు వ్యవస్థలో పనిచేసేవారు కూడా మనలాగే మనుషులే. తప్పులు జరిగితే చట్టపరమైన మార్గాల్లో స్పందించాలి. కానీ కొందరి తప్పుల వల్ల మొత్తం వ్యవస్థను దూషించడం సమాజానికి మేలు చేయదు.

మన భద్రత కోసం పనిచేసే వారిని గౌరవించడం, వారికి సహకరించడం మన బాధ్యత. పోలీసు వ్యవస్థ బలంగా ఉంటేనే సమాజం సురక్షితంగా ఉంటుంది

.చివరి మాట

మనకు కష్టసమయంలో గుర్తుకొచ్చేది 100 నెంబర్. ఆ కాల్‌కు స్పందించి మన దగ్గరకు చేరేది పోలీసే. అందుకే విమర్శించే ముందు వారి సేవలను గుర్తుచేసుకోవాలి.సమాజం సురక్షితంగా ఉండాలంటే ప్రజలు -- పోలీసులు కలిసి నడవాలి.

పోలీసు వ్యవస్థ మనకు ఒక అజ్ఞాత కవచం. దానిని బలోపేతం చేయడం మనందరి బాధ్యత.

## క్రీడల అభివృద్ధి లక్ష్యం

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి





గుమ్మడిదల మండలం నవతరం :-

గుమ్మడిదల్ మండలంలోని అనంతారం గ్రామంలో క్రీడాభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామ వాలీబాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్స్‌ను ఆదివారం రాత్రి ప్రారంభించారు. గ్రామ యువత క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన సొంత నిధులతో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీను ప్రారంభించారు.ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు సరైన వసతులు కల్పించడం అత్యంత అవసరమని, రాత్రి వేళల్లో కూడా క్రీడలకు ఈ ఫ్లడ్ లైట్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల ద్వారా యువత ఆరోగ్యవంతంగా ఉండడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

సర్పంచ్ కొమ్ము శ్రీను మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న చిమ్ముల గోవర్ధన్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ వాలీబాల్ గ్రౌండ్ ఫ్లడ్ లైట్స్ వల్ల గ్రామ యువతలో మరింత ఉత్సాహం పెరిగి క్రీడా రంగంలో కొత్త విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, సిజిఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, గోపాల్, సాయి రెడ్డి, భాస్కర్ గౌడ్, మహేష్ యాదవ్, లక్ష్మణ్, రమణ, భాస్కర్, యాదగిరి, నర్సింగారావు, ప్రవీణ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి,మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి






గడ్డపోతారం మున్సిపల్ నవతరం :-

ఖాజీపల్లిలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామివారి 18వ వార్షి కోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆకుల మమత నవీన్, గండి స్వప్న కుమార్ యాదవ్, అర్కాల్ సంధ్య సురేష్, నాయకులు మురళి యాదవ్, సమీర్, గణేష్, వరుణ్, బాలు, మహేష్, అశోక్, మాజీ వార్డు మెంబెర్ కురుమ కృష్ణ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోండి

- ఎమ్మెల్యే జిఎంఆర్ కు వినతి- గుమ్మడిదల మండల రైతులు



గుమ్మడిదల మున్సిపాలిటీ నవతరం :-

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కు గుమ్మడిదల మండలానికి చెందిన రైతులు వినతి చేశారు. సొసైటీ ద్వారా మొక్కజొన్న పంటను విక్రయించి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గుమ్మడిదల సొసైటీ మాజీ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానంద రెడ్డి మాట్లాడుతూ పంటను అమ్మి రెండు నెలలు పూర్తయినా చెల్లింపులు అందక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారి అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు

ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుల చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తానని తెలిపారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com

# సమస్య పరిష్కారానికి ధన్యవాదాలు

- చెత్త సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసిన గుమస్తా మధుసూదన్
- 24 గంటల్లో పరిష్కారం చూపించిన మున్సిపల్ అధికారులు
- ధన్యవాదాలు తెలిపిన నాయకులు, ప్రజలు








కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ మొట్టమొదటి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆదేశాల మేరకు చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ను కలిసి శ్రీరామ్ నగర్ (బి) లో సాయి బాబా మందిరం, దర్గా పరిసర ప్రాంతాల్లో... చెత్తను వేస్తూ గుడికి, దర్గాకు వచ్చే భక్తులకు, ప్రజలకు ఇబ్బందిగా ఉందని ప్రజావాణి లో తెలియజేశారు స్థానిక కాంగ్రెస్ నాయకులు గుమస్తా మధుసూదన్. ప్రజావాణి ఫిర్యాదుకు స్పందించిన డీసీ లావణ్య, డీఈ సాగర్ సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో... బస్తిలో నెలకొన్న సమస్యలపై డీఈ సాగర్ శ్రీరాంనగర్ విచ్చేసి అక్కడ ఉన్న సమస్యను పరిష్కారం అయేలా చూస్తానని చెప్పారు. సమస్య ఉందని చెప్పగానే కేవలం 24 గంటలో సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసినందుకు డిప్యూటీ కమిషనర్, డీఈ కి ప్రత్యేక అన్నారు స్థానిక నాయకులు. ఈ కార్యక్రమంలో రోడమేస్త్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ యువజన నాయకులు గుమస్తా మధుసూదన్, బస్తీ మాజీ అధ్యక్షులు రఘురెడ్డి, కాంగ్రెస్ నాయకులు మురళీకృష్ణ, ప్రవీణ్, స్థానిక బస్తీ నాయకులు చిన్న వీరేష్, స్థానిక కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# తనుచదువుకున్న పాఠశాలలోనే సేవా కార్యక్రమాలకు శ్రీకారం

**విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం లక్ష్యం**

**సొంత నిధులతో వాటర్ డ్రమ్ము అందజేసిన**

**13వ కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి**




గుమ్మడిదల మున్సిపాలిటీ నవతరం:–
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని
తాను చదువుకున్న పాఠశాలలోనే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచారు 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. పాఠశాలలో ఉన్న పాత వాటర్ డ్రమ్ము పూర్తిగా పగిలిపోయి నీరు వృథాగా పోతుండగా, ఈ సమస్యపై గత పాలకులు పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నరేందర్ రెడ్డి తన సొంత నిధులతో కొత్త వాటర్ డ్రమ్మును కొనుగోలు చేసి, పైప్ లైన్ ఫిట్టింగ్‌తో సహా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పాఠశాలలో చదువుకున్న తనకు ఈ విద్యాసంస్థపై ప్రత్యేక అనుబంధం ఉందని, చిన్నారుల కోసం ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. చిన్న సమస్యైనా వెంటనే పరిష్కరించడమే మా కాంగ్రెస్ పార్టీ విధానం. నిర్లక్ష్య పాలనతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ఆనంద్ కుమార్, నాగరాజ్, నాయకులు తులసి దాస్, యాదగిరి, పడమటి వెంకటరెడ్డి, మద్దటి మల్లేష్, శ్రీనివాసరెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాహుల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# 'డబుల్ సునీల్'ల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

**సునీల్ నాయక్ బీహార్లో అరెస్ట్**

**సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు**



హైదరాబాద్, నవతరం: రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. అప్పట్లో అధికార గర్వంతో జగన్ కళ్లలో ఆనందాన్ని చూడడానికి చట్టాన్ని చుట్టచుట్టిన ఐపీఎస్ అధికారుల చుట్టూ ఇప్పుడు న్యాయస్థానం, పోలీస్ విచారణ ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న పి.వి. సునీల్ కుమార్ మరియు సునీల్ నాయక్ అనే ఇద్దరు అధికారుల విషయంలో గత 24 గంటల్లో చోటుచేసుకున్న పరిణామాలు ఈ క్రైమ్ క్లైమాక్స్ దిశగా సాగుతోందని స్పష్టం చేస్తున్నాయి.

**అధికార దుర్వినియోగం నుండి అరెస్టుల వరకు**

ఈ కేసులో ప్రధాన సూత్రధారి (ఏ1)గా ఉన్న 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ పి.వి. సునీల్ కుమార్ విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ఫిబ్రవరి 22, 2026తో ముగియాల్సిన ఆయన సస్పెన్షన్‌ను ప్రభుత్వం తాజాగా మరోసారి పొడిగించింది. ఈ పొడిగింపు సాదాసీదాగా కాకుండా, ఆయన పదవీ విరమణ పొందే జూన్ 30, 2026 వరకు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. అంటే, సుదీర్ఘ కాలం పోలీస్ బాస్‌గా వెలిగిన సునీల్ కుమార్, చివరకు యూనిఫామ్ లేకుండా, సస్పెన్షన్ నీడలోనే సర్వీసు నుండి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న బలమైన కారణంతోనే ఆయనను సర్వీసులోకి తీసుకోకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు, ఈ క్రైమ్ స్టోరీలో క్షేత్రస్థాయిలో హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ కథ మరో మలుపు తిరిగింది. బీహార్ కేడర్‌కు చెందిన ఈయన, ఏపీలో డిప్యూటేషన్ ముగిసిన తర్వాత తిరిగి తన మాతృ రాష్ట్రానికి వెళ్లిపోయారు. అక్కడ డీఐజీగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, ఏపీ పోలీసులు బీహార్‌కు వెళ్లి మరీ ఆయనను అరెస్ట్ చేయడం సంచలనం సృష్టించింది. రఘురామకృష్ణరాజును కస్టడీలో ఉంచినప్పుడు, ఆయన అరికాళ్ళపై రబ్బర్ బెల్టులతో కొట్టడం, శారీరకంగా హింసించడంలో సునీల్ నాయక్ ప్రత్యక్షంగా పాల్గొన్నారనే దానికి పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు.

**బిగుస్తున్న ఉచ్చు – క్లైమాక్స్ దిశగా..**

ఈ ఇద్దరు అధికారుల ప్రమేయం కేవలం వ్యక్తిగత ద్వేషంతో కాకుండా, అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు సాగిందని విచారణలో తేలుతోంది. పీవీ సునీల్ కుమార్ కుట్రకు పునాది వేయగా, సునీల్ నాయక్ ఆ హింసాకాండను అమలు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఉన్న మెడికల్ రిపోర్టులు, సీఐడీ కార్యాలయంలోని సాక్ష్యాలు వీరిద్దరి మెడకు చుట్టుకున్నాయి. సునీల్ నాయక్ అరెస్టుతో ఈ కేసులో మరిన్ని రహస్యాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇన్నాళ్లూ 'చట్టం మా చేతుల్లో ఉంది' అని భావించిన అధికారులకు, ఇప్పుడు అదే చట్టం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. బాధితులకు న్యాయం జరిగే సమయం ఆసన్నమైందని, దోషులు కటకటాల వెనక్కి వెళ్లడమే

# రాజీవ్ గృహ కల్పలో ప్లాట్ల కబ్జాలను అరికట్టాలి

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం**




కుత్బుల్లాపూర్, నవతరం: బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప జరుతున్న అవినీతి పై మేడ్చల్ –మల్కాజ్గిరి జిల్లాలో ప్రజా వాణి సమస్య పరిస్కారం చేయాలనీ సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం, సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహ కల్పలో దాదాపు యాభై ప్లాట్లు ఖాళీగా వున్నాయి అని వారు గుర్తు చేశారు. వాటిని స్థానికంగా కొంత మంది కబ్జా చేశారు అని , ప్రస్తుత సమాజంలో కబ్జాదారులు వేటిని వదలకుండా ప్రతిదీ కబ్జా చేస్తున్నారు. కనుక రాజీవ్ గృహ కల్ప కబ్జాకు గురిరైనా యాభై ప్లాట్లను వెంటనే పేద ప్రజలకు కేటాయించాలని వారు కోరారు. అలాగే రాజీవ్ గృహ కల్ప ప్రక్కన వున్న స్థలంలో స్థానిక ప్రజలు స్మశానవటిగా ఉపయోగించే వారు కనుక అటి స్మశాన వాటికను గుర్తించి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బక్క మల్లేష్, పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ సామ్రాట్ గుప్తాకు టిడబ్ల్యుజేఎఫ్ అండ



ఖమ్మం, ఫిబ్రవరి 22రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణ బ్రాడకాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీబీజేఏ) జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తాను టిడబ్ల్యుజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్ లు పరామర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యూనియన్ నాయకులు స్పందించి ఖమ్మంలోని భవాని హాస్పిటల్‌కు తరలించి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహింప జేశారు. వైద్యుల సూచన మేరకు ఆయన కుడి కాలుకు సాధారణ శస్త్రచికిత్స నిర్వహించగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ చక్రవర్తి వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకుని అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ప్రమాద సమాచారం అందుకున్న జిల్లా నాయకులు వంగ పుంగమ గౌడ్, కందరబోయిన నాగకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని సామ్రాట్ గుప్తాను ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. అనంతరం శస్త్రచికిత్స పూర్తయ్యాక ఆయననువైద్యుల సూచన మేరకు విశ్రాంతి కోసం తన నివాసానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి సామ్రాట్ గుప్తకు వైద్య సేవల సహకారం అందించిన జర్నలిస్టు మిత్రులను అభినందించారు. టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) కుటుంబం ఎప్పుడూ ఐక్యంగా ఉండాలని, ఇలాంటి ప్రమాదకర ఘటనలు జరిగినప్పుడు పరస్పర సహకారం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక సేనాని జలజక్క

**దామరపల్లి నర్సింహారెడ్డి రచయిత**



విప్లవోద్యమంలో ఎన్నో సంవత్సరాలు నిబద్ధతతో పనిచేసిన జలజక్క క్యాన్సర్‌తో పోరాడుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆమె మృతి విప్లవ శక్తులకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా భావిస్తున్నారు. విద్యార్థి దశలోనే పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రజా జీవితంలో అడుగుపెట్టిన జలజక్క, అనంతరం సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీ, రైతు––రైతు కూలి సంఘం, సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ, తన గళంతో ప్రజలను ఉత్తేజపరిచిన విప్లవ గాయని గా గుర్తింపు పొందారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ఐక్యవేదిక ఏర్పాటుచేసిన బహిరంగ సభలకు జలజక్క కాలుకు గజ్జ కట్టి భుజాన గొంగడి వేసి తెలంగాణ పాటలతో తెలంగాణ వైపు మళ్ళించారు అరుణోదయ సంస్కృతిక సమస్యలు చురుకైన కళాకారునిగా పనిచేశారు బీడీ కార్మికుల కోసం విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ఉద్యమంలో ప్రపంచీకరణ సామ్రాజ్యవాదం వ్యతిరేక ఉద్యమాలలో అలుపెరుగని పోరాటం నిర్వర్తించింది తాను తుది శ్వాస విచ్చేంత వరకు నమ్మిన సిద్ధాంతం కోసం మార్క్సిజం లేని నిజం మావో ఆలోచన విధానం పై ఆమె పాటుపడింది తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పల్లె పల్లె తిరిగి ప్రజలను చైతన్య పరిచి ప్రజా ఉద్యమాల వైపు మళ్ళించగలిగింది అరుణోదయ విమలక్క తో పైలం సంతోష్ మల్సూర్ వెంకన్న తదితరుల కళాకారులతో ఆమె కళా రంగం కొనసాగింది ఆమె ఎప్పుడు విడుద ప్రజల హృదయాల్లో మెదులుతూనే ఉంటుంది విద్యార్థి దశ నుండి విప్లవోద్యమంలోకి అడుగు పెట్టింది ఆమె అంకెలంచలేదు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది పైలం సంతోష్ కూడా క్యాన్సర్ బారినపడి చనిపోయినాడు ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి తెలంగాణ కళాకారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందిఏనాడు విడువలేదు జలజక్క లేదన్న వార్తను అందరిని ఉద్యమకారులను కళాకారులను పరిచింది జలజక్కభర్త భూపతి రామచంద్రం ను పార్టీలోనే వివాహం చేసుకుంది మనస్పర్ధలతో విడిపోయారు అయినా ఉద్యమాలలోనే పనిచేస్తూనే ఉందిఅనేక ప్రాంతాల్లో ఆమె పాడిన పోరాట గీతాలు ప్రజల్లో చైతన్యం రగిలించాయి. మల్లుపల్లి అమరవీరులైన కామ్రేడ్ జాన్సన్, కనకయ్య, అప్సర్ బాయిలను స్మరిస్తూ పాడిన గీతాలు ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా చేశాయి. "దీపాల యాలకు వెలుగులే వచ్చేటి బిడ్డలు..." వంటి పాటలు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించాయి. మానేరు, మంజీరా, దుబ్బాక, గిరాయిపల్లి మిరుదొడ్డి సిద్దిపేట, సిరిసిల్ల, గుమ్మడిదల, నర్సాపూర్, గజ్వేల్, మెదక్, చేగుంట, నార్సింగు, రామాయంపేట్ తదితర ప్రాంతాల్లో ఆమె పోరాట గీతాలు మార్మోగాయి. జలజక్క పేరు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసే చిహ్నంగా నిలిచింది.

నవతరం
నేటితరం కోసం...



# వేదాంతపురంలో వ్యక్తి మృతి

**- గుండెపోటో? గొంతు నులిమిన మిస్టరీయో?**
**- అనుమానాస్పదంగా దహన సంస్కారాల నిర్వహణ**
**- అంత్యక్రియల వేళ వింత ప్రవర్తనపై గ్రామస్థుల్లో గుసగుసలు**
**- పోలీసులు సుమోటోగా విచారణ చేపట్టాలని డిమాండ్**

నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, వేదాంతపురం గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ఒక మరణం ఇప్పుడు అనేక ప్రశ్నలకు తావిస్తోంది. 48 ఏళ్ల ఒక వ్యక్తి నిద్రిస్తున్న సమయంలోనే హార్ట్ స్ట్రోక్ వచ్చి మరణించాడని కుటుంబ సభ్యులు చెబుతున్నప్పటికీ, ఆ మరణం వెనుక బలమైన మిస్టరీ దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తొందరగా ముగిసిన అంత్యక్రియలు:
సాధారణంగా ఎవరైనా మరణించినప్పుడు బంధువులందరూ వచ్చేవరకు వేచి చూడటం ఆనవాయితీ. కానీ, ఈ కేసులో శనివారం సాయంత్రం 4 గంటలకు మరణం సంభవిస్తే, ఆదివారం ఉదయానికే దహన సంస్కారాలు ముగించేయడంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారికి సోమవారం హైదరాబాద్‌లో పరీక్షలు ఉన్నాయనే సాకుతో అత్యంత వేగంగా ఈ కార్యక్రమాన్ని ముగించడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

అంత్యక్రియల వేళ వింత దృశ్యాలు:
మృతుడి భార్య ప్రవర్తన మరియు అక్కడ ఉన్న ఒక సమీప బంధువు వ్యవహారశైలి అంత్యక్రియలకు వచ్చిన వారిని విస్మయానికి గురిచేసింది. దుఃఖంలో ఉండాల్సిన సమయంలో వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం, ఆ బంధువు అతిగా ప్రవర్తించడం వంటి అంశాలు క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. మృతుడు మద్యానికి బానిస కావడాన్ని ఆసరాగా తీసుకుని, ఈ మరణాన్ని సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని



స్థానికులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

పోలీసులు స్పందించాలి:
ఒక నిండు ప్రాణం బలయ్యిందా? లేక నిజంగానే సహజ మరణమా? అన్నది తేలాలంటే పోలీసులు ఈ విషయంలో సుమోటోగా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరణించిన వ్యక్తికి మరియు అతని భార్యకు మధ్య ఉన్న సంబంధాలు, సదరు బంధువుతో ఆమెకు ఉన్న సాన్నిహిత్యంపై లోతైన విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ మిస్టరీని ఛేదించాలని ప్రజలు కోరుతున్నారు.

# నాటు కోళ్లు దొంగల హల్ చల్

**- ఒంటరిగా నివసిస్తున్న ఇళ్లపై దోపిడీలు**


**- పదుల సంఖ్యలో దొంగిలించటంతో ఉపాధి దెబ్బతింటున్న వైనం**


**ఇంటి ఆవరణలో విద్యుత్ వైర్లు తొలగించి దొంగతనాలు**

**- పోలీస్ శాఖ చొరవ చూపించాలంటూ గ్రామస్తుల విజ్ఞప్తి**

**వ్యవసాయ పొలాల్లో వ్యవసాయం మానుకోవాలని ఆందోళనలో బాధిత కుటుంబాలు**






నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణాభివృది కోసం ప్రభుత్వం నాటు కోళ్ల పెంపక అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వం సైతం ఉపాధిని కల్పిస్తుందని, జిల్లా కలెక్టర్లు సైతం ప్రోత్సాహంకులకు సలహాలు సూచనలు ఇవ్వడంతో ఇప్పటికే కొందరు వాటిని పెంచేందుకు మక్కువ చూపి నాటు కోళ్ల పెంపకం కొనసాగిస్తున్న సందర్భంలో కొందరు దొంగలు దొంగలించడంతో భారీ స్థాయిలో నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తుంది. అంతేకాకుండా ఒంటరిగా నివసిస్తున్న ఇళ్లను ఎంచుకొని పదుల సంఖ్యలో కోళ్లను దొంగలించడం మండలంలో సంచలన సృష్టిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలంలోని,గుర్రాల చెరువు గ్రామ శివారులో రామకృష్ణ పామాయిల్ తోట కౌలు వ్యవసాయం నిర్వహిస్తున్న కోనప రాజు సువర్ణ రాజు తండ్రి నాగరాజు వయసు 70 సంవత్సరాలు ఇంటి ఆవరణలో ఉన్న సుమారు పది కోడిపుంజులను దొంగలించడంపై భారీ స్థాయిలో ఉపాధిని కోల్పోయినట్లు బాధితుడు మీడియా ముఖంగా తెలపడం జరిగింది. గత రెండు సంవత్సరాల నుండి పెంచి పెద్దవిగా చేయటం వాటిని విక్రయించే దిశలో ఉన్నప్పుడు ఇలా జరగటం దురదృష్టకరమని, సుమారు రెండు లక్షల 50 వేల రూపాయల విలువగల కోళ్లను ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ వైర్లను తొలగించి కోళ్లను దొంగలించడం జరిగిందని సువర్ణ రాజు మీడియా ముఖంగా తెలపడం జరిగింది.ఇటువంటి దొంగలు పట్టణానికి చెందిన వారా?లేక బయటవారా?అన్న సందేహాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.గత కొన్ని రోజులుగా కొందరు వ్యక్తులు కొన్ని విషయాలలో బాధితునిపై కవ్వింపు చర్యలు కొనసాగిస్తున్నారని,వారే ఇటువంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారా?లేక సుదూర ప్రాంతాల నుంచి దొంగలించుటకు వచ్చారా? అన్న సందేహాలు సైతం వ్యక్తం అవుతున్నాయని బాధితుడు మీడియా ముఖంగా తెలిపారు

. ప్రభుత్వం నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంటే కొందరు ఆకతాయంగా ఇటువంటి దొంగతనాలకు పాల్పడటం దురదృష్టకరమని పట్టణంలోని చాలామంది మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి విధానాన్ని పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు పరిగణలో తీసుకొని పరిశీలన చేయాలని బాధితులు కోరుకుంటున్నారు.

# నల్గొండపై ఫార్మా భూతం

హైదరాబాద్, నవతరం: కాలుష్యకారక పరిశ్రమలన్నింటినీ నగర పరిసరాల్లోంచి దూరంగా తరలించాలి... ఇటీవలి కాలంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఐటీ మంత్రి మూకుమ్మడిగా చెబుతున్నమాట ఇది. దూరంగా అంటె ఎక్కడికి? ఓఆర్ఆర్, ఐఆర్ఆర్ అవతలికి. ఆ మాట కూడా వారే స్పష్టంగా చెబుతున్నారు. ఇంకా చిత్రం ఏమంటే కోర్టులు కూడ అదే మాట చెప్పడం. నగరంలో కాలుష్యం వద్దు. నల్గొండ జిల్లాలో కాలుష్యం పర్వాలేదా? ఇక్కడ ప్రజలు ఉండరా? ఊళ్లు ఉండవా? బావులు చెరువులు ఉండవా? ఇక్కడ భూమి, నీరు, గాలి కలుషితం కావా? అయితే మాత్రం ఇక్కడ అడిగేదెవరు? కొట్లాడేదెవరు? ఇప్పుడు నల్గొండ జిల్లా ఫార్మా డంపింగ్ యార్డ్ గా మారుతున్నది. ఒకప్పుడు పటాన్చెరు, బాలానగర్, బొల్లారం, కూకట్పల్లి ప్రాంతాలను విషతుల్యం చేసిన ఫార్మా పరిశ్రమలు ఇప్పుడు చౌటుప్పల్, చిట్యాల మండలాలను ముంచెత్తుతున్నాయి. పరిశ్రమల చుట్టూ భూమిని చూడండి. చెట్ల ఆకులు చూడండి, భూగర్భజలాలు చూడండి. పరిస్థితి అర్థమవుతుంది. ప్రపంచ దేశాలు ఫార్మా పరిశ్రమలు వదిలించుకుంటున్నాయి. అమెరికా యూరప్ దేశాలు అక్కడ ఫార్మా యూనిట్లను



మూసివేసి మనదేశంపై పడుతున్నాయి. మనదేశాన్ని ఫార్మా, వాక్సిన్లకు ప్రయోగశాలగా మార్చుకుంటున్నట్టు ఘనత వహించిన దాత, వ్యాపార సామ్రాజ్యవాది, చిన్నపిల్లల బలి దేవత రాతపూర్వకంగానే ప్రకటించాడు. మనకే తోలు మందం. ప్రపంచమంతా మేలుకున్నాక చివరగా మేలుకుంటాం. వాడు యెంత పాపి అయినా సరే పెట్టుబడులు తెస్తానంటే పట్టు తివాచీలు పరిచి వాడి కరచాలనంతో పులకించిపోతాము. ఫ్లోరైడు భూతాన్ని




ఇప్పుడిపుడే వదిలించుకుంటున్నాం. మళ్ళీ మరో భూతాన్ని జిల్లాపై రుద్దుతారా? ఇటీవలే ఒక కంపెనీ పేలి కాలి మనుషులు బూడిద అయిపోయారు. మరో కంపెనీలో రియాక్టర్లు పేలి మనుషులు చనిపోయారు. మనకు ఇప్పుడున్న ఫార్మా చాలు. దయచేసి ఫార్మా భూతాన్ని ఇంకా పెద్దది చేయకండి. ముచ్చర్ల ఫార్మాను కూడా నల్గొండవైపు మళ్లించే ప్రమాదం ఉంది.

డా. నర్సింలు ఎల్లంపల్లి
సీనియర్ జర్నలిస్ట్
ఫోన్: 9618907705

# మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

- ఎమ్మెల్యే జారె





అశ్వారావుపేట మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం మండల అధ్యక్షులు కురిశెట్టి నాగబాబు అధ్యక్షతన మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ శ్రీమతి జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ తో పాటు మున్నూరు కాపు సంఘానికి చెందిన ప్రజాప్రతినిధులు దండాబత్తుల ఆదిలక్ష్మి,కట్టా సింధుజ,కొట్టే నాగసునీత,అట్టం రమ్య (పోకల),చిన్నంశెట్టి శ్రీను, తిరుమలశెట్టి వెంకన్నబాబు ని శ్రీ సత్య సాయిబాబా కళ్యాణ మండపం నందు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై కాపుసంఘ నాయకులతో కలిసి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం ప్రజా సేవలో ముందుండాలని కోరారు. కాపుసంఘం ఆధ్వర్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను సత్కరించడం అభినందనీయం అని తెలిపారు.మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు,మున్సిపల్ చైర్ పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్,మాజీ సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనలు 26వేలకు పెంచాలి

చీపురుపల్లి,ఫిబ్రవరి23 తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు ఆధ్వర్యంలో చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సోమవారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అంబాల గౌరి నాయుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టీ మాలతి, నాగమణి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా అంగన్వాడీలను ఇబ్బందులు గురిచేస్తుందని వారు అన్నారు. ఫిబ్రవరి నుండి జరిగే బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని మిగిలిన మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లను క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంట్రల్ గా మార్చాలని వారు కోరారు. గ్రాట్యూటీ అమలకు గ్‌లడైన్స్ రూపొందించి వేతనముతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ మరియు రూరల్ అనే తేడా లేకుండా అందరికీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లు నిర్దిష్టమైన గ్‌లడైన్స్ రూపొందించి అమలు చేయాలని అలాగే పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వాడు ప్రభుత్వాన్ని కోరారు. మే నెల అంతా వేసవి సెలవుల జీవో ప్రకటించాలని కోరారు. వీటితోపాటు లబ్దిదారులకు బియ్యం ఆయిల్ కందిపప్పు లకు సంబంధించి క్వాంటిటీ పెంచాలని మెనూ చార్జీలు పెంచడంతోపాటు ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు అంతేకాకుండా ప్రీస్కూల్ బలోపేతం చేయాలని ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందన పథకాన్ని అమలు చేయాలని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడి సెంటర్ లో ఉండాలని జీవో ఇవ్వాలని వర్కోరారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే తాము ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మరియు సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

శ్రీనగర్,ఫిబ్రవరి23:జమ్మూకశ్మీర్ లోని కిస్ట్వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైపుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# మాజీ రైల్వేమంత్రి ముకుల్ రాయ్ మృతి

కోల్‌కతా,ఫిబ్రవరి23(: మాజీ రైల్వే మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు ముకుల్ రాయ్ మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు కోల్‌కతాలోని సాల్ట్ లేక్ అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. రాయ్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారు. అనేక అనారోగ్యాలతో బాధపడుతున్న రాయ్ కొన్ని రోజుల క్రితం కోమాలో ఉన్నారు. మృతదేహాన్ని ఆయన నివాసానికి తీసుకెళ్లి, అంత్యక్రియలు నిర్వహించారు.